# కాబోయే పెళ్ళికొడుకు

బుసలు కొడుతూ గదంతా చకచకా పచార్లు చేస్తున్నాడు రాంబాబు. పెద్దగా నిట్టూరుస్తూ ఎంతపని జరిగింది అని లోపల అనుకున్నాడు. అసలు తప్పునాది. ఆ క్షణాన గభాలున లేచి రావల్సింది. ఏమిటో తోచలేదు. దేభ్యంలాగ అక్కడే కూర్చుని అడిగిన ప్రశ్నలన్నింటికీ బళ్ళోపిల్లాడిలాగ సమాధానాలు చెప్పొచ్చా;'ఏమావహించింది రాంబాబూ నీకు ఆ క్షణంలో. కూర్చున్న వాడివి కూర్చున్నట్టుగానే వుండిపోయావు. అయ్యో అయ్యో నీకు మతేమన్నా పోయిందా ! నీకేమన్నా దిగులు పట్టుకుందా పెళ్ళి కాదేమోనని ; ఆ ప్రశ్నలన్నింటికీ సరిగ్గా సమాధానాలుచెపితే పెళ్ళి పరీక్షలో ప్యాసయిపోతావనుకున్నావా; ఏమనుకున్నావు? ఏం చేశావు,' అంటూ లోపల లోపల గుణించుకుంటూ అక్కసు పడిపోతున్నాడు.

వీథి తలుపు చప్పుడయ్యేటప్పటికి దభాలున ఆగేసి గతుక్కుమన్నాడు. రాజబాబులాగ బుజాలు పైకిపోనిచ్చి మొహమంతా గంభీరంగా పెట్టి, అడుగుల్లో అడుగులువేసుకుంటూ మెల్లి మెల్లిగా వీథిగుమ్మం దగ్గరకు వెళ్ళేటప్పటికి మళ్ళీ తలుపు బడబడ చప్పుడయింది. గుటకలు వేస్తూ

ఏడుపు మొహం పెట్టి, మళ్ళీ మొహాన్ని యిట్టే వెడల్పు చేసేసుకుని నిటారుగా నిలబడి అమాంతం తలుపులు రెండూ బార్లగా తెరిచేశాడు.

'చంపేశావు నువ్వుట్రా ! ...... ' తెరిచిన నోరు అట్టాగే వుండి పోయింది.

'...తలుపులేసుకుని లోపలేం చేస్తున్నావు ఓంటరిగా. ఏమయ్యారు మనవాళ్ళంతా...' వాసు లోపలికి రావటమేమిటి, రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చోటవేమిటి అన్నీ యిట్టే జరిగి పోయినాయి.

'అంతా కట్టకట్టుకుని సినిమాకెళ్ళారు గాని, నువ్వా కుర్చీలో కూచ్చుంటే కూచ్చోగాని అట్టా తిరక్కురా, నాకళ్ళు తిరుగుతున్నాయి, ముందర...' ఆయాసపడుతూ అన్నాడు రాంబాబు.

'ఒరేయ్ ఆగమంటే ఏమిటీ......' అంటూ కుర్చీని రెండుచేతుల్తో పట్టుకుని ఆపేసి మొహంలో మొహం పెట్టి వాసు వంక చూస్తూ చప్పున వెనక్కు వెళ్ళి పోయాడు. అసలు నీమూలాన యిదంతా జరిగిందంటూ.

వాసు చిరునవ్వు మొహంతో రాంబాబు వంక చూసి, మెదలకుండా వూరుకొన్నాడు.

'నీదోపాడలవాటు నువ్వొక్క ప్రశ్న వెయ్యవు. నీ ప్రశ్నలన్నీ నేనే వెయ్యాలి, సమాధానాలు కూడా నేనే చెప్పుకోవాలి. సరే కానీ, నేను చూడను మొర్రో అంటే నువ్వొన్నావా ! నువ్వు వెళ్ళమనబట్టే యీసారి నేను వెళ్ళింది. లేకపోతే గడప కదిలేవాన్నికాదు. వెళ్ళాను పో, వెళ్లితే ! పెళ్ళిచూపులకు వెళ్ళేది నేనూనూ ప్రశ్నలు వేసేదీ, పరీక్ష చేసేదీ ఆ అమ్మాయినా ! ఇదికూడా సభ్యతే అంటావా ! ఎంతవరకు చదువుకున్నారు ! ఈ ప్రశ్న బాగానే వుంది, నాకు సమాధానం చెప్పటంలో అభ్యంతరం యేమీ లేదు. చెప్పాను కూడా. ఉద్యోగం యేమన్నా !

ఏమిటా ప్రశ్న? ఎవరైనా యిస్తేగా చెయ్యటానికి! నేను నిరుద్యోగిననే విషయం ఆ అమ్మాయికి పూర్తిగా తెలుసు. తెలిసి నలుగుర్లో నన్ను ఇన్‌సల్ట్ చెయ్యటానికి అడుగు తుందా! ... ఏం, మాట్లాడవేం?'... గబగబ ముందు కొచ్చి వాసు కూర్చున్న కుర్చీని గట్టిగా, కసిగా గిరగిర తిప్పేశాడు.

'ఒరేయ్! ఒరేయ్!! నా కళ్ళు తిరిగి పోతాయి. కింద పడి పోతారా...' కాళ్లు కింద పెట్టేసి తూలుతూ కింది నిలబడ్డాడు వాసు.

'నిన్ను పెళ్లిచూపులకు వెళ్ళొద్దని యెన్నోసార్లు చెప్పాను, నీకు బుద్ధిలేదు'...

'ఆఁ! ... నువ్వే వెళ్ళమన్నావని చెప్పింది మా అమ్మ...'

'నువ్వెంత వరకు అధికుడనని అను కుంటూ వుంటావో అంతవరకు తప్పవు, నీ కీపాట్లు! మనిషిని మనిషిగా చూట్టం నేర్చుకోవటం నీకింకా చేతకాలేదు. నీ చదువూ సంస్కారం సభ్యత అన్నీ నువ్వూహించుకున్న పరిమితిలోనే తిరుగు తున్నాయి.

'నీకా పెళ్ళయింది. తండ్రి కూడా కాబోతున్నావని విన్నాను. కంగ్రాట్యులేషన్స్ ... అదటుంచు. నువ్వెన్నైనా తాపీగాకూచుని ఉపన్యాసాలు చెపుతావు. నీళ్ళల్లో వున్నవాడికి తెలుస్తుందిరా ఆబాధ ఒడ్డెక్కిన వాడికి నీకేం తెలుస్తుంది! నేను నిజంగా చెప్పాలంటే ఆడవాళ్ళకు యెంతో గౌరవం యిస్తాను. వాళ్ళనెప్పుడు చిన్నచూపుతో చూడను. అయితే నువ్వో ప్రశ్న వేస్తావు. 'ఇంత మందిని చూశావుగదా, అందులో ఒక్క ఆడపిల్ల నీకు నచ్చలేదా అంటావు' అంతేగా...నిజంగా నా కంటికి నచ్చలేదు. అది వాళ్ళ అదృష్టమో నా దురదృష్టమో నాకయితే తెలీదు. అది నువ్వు నిర్ణయించాల్సిందే! ... నిన్న జరిగిన అవమానం తలుచుకుంటే

రక్తం ఉడికి పోతోందంటే నమ్ము ... నేను నచ్చలేదన్నా నాకేం బాధ లేదు. పోనీ ఆ అమ్మాయి కంటికి నేను ఆనలేదు. సరే ఒప్పుకుంటా ... అంతటితో వూరుకుండా మా తమ్ముడు నచ్చాడంటుందా! ఏమిటా సాహసం! ఇది డైరెక్ట్ ఎటాక్ అవునంటావా కాదంటావా! ఇంకా నేను తలెత్తుక తిరగ గలనా ! అసలు వీడొకడు నువ్వింటి దగ్గర కూర్చోరా అంటే నేను వస్తా, వదినను చూస్తా అంటాడు. వీడితో పెద్దతంటాగా వుంది. అసలు మేమి ద్దరం ఒకచోట నుంచుంటే, వాడికి నేను తమ్ముడిగా కనిపిస్తాగదా ! అలాంటప్పుడు నావెంట రావటం యెందుకు చెప్పు. వద్దంటే కోపం. ... ఇంకా నేను భరించలేను' ... రాంబాబు ఎగిరెగిరి గంతు లేస్తున్నాడు.

'అయిందా, నే చెపుతా పట్టు. కిందటి సారి వెంకటప్పయ్యగారింటికి వెళ్ళి నప్పుడేమన్నావో గుర్తుతెచ్చుకో...'

'అయ్యో, దానికీ దీనికీ పోలికేమిట్రా బాబు. ...'

'ఏం ఎందుకు లేదు. ... పెళ్ళిచూపులకని వెంకటప్పయ్యగారి రెండోకూతుర్ని తీసుకొచ్చి కూర్చోపెడితే ఆ అమ్మాయి విషయం మాట్టాట్టం పోయింది. మూడో కూతుర్ని నచ్చిందంటావా? దానికి రాయ బారులు పంపిస్తావా! ఆఁ ఆడవాళ్ళంటే చులకనే నీకు...గౌరవం, మర్యాద అనేవి యిచ్చే పుచ్చుకొనేవి. ఇవ్వాళ ఆ అమ్మాయి నీ తమ్ముడి విషయం అనేటప్పటికి యెక్కడలేని అభిమానం పొడుచుకొచ్చింది. ఆనాడు వాళ్లెంత బాధపడివుంటారో వూహించావా !...'

'అన్నా అను. నీయిష్టం వచ్చినట్టల్లా, అను. అసలే క్రుంగి కృశించే వాడిమీద యింకో రాయి వేస్తేగాని నీకు తృప్తిగా వుండదులే...'

'పోస్టుమాన్...' ఓ కవరు గిరాటు పెట్టి సైకిలు మీద తుర్రు మన్నాడు.

నాలుగు కళ్ళు ఆ కవరుమీద పడ్డాయేగాని అందులో యెవ్వరూ కూడా ముందుకు రావటంలేదు. రాంబాబు శరీరంలో వణుకు పుట్టుకొస్తోంది. ఆ కవరు వాలకం చూస్తుంటే శుభలేఖ అని యిట్టే తెలిసిపోతోంది. అందు కనే అంత కంగారూ, భయమూనూ. రాంబాబు తల గిర్రున తిరిగిపోయింది. ఎట్లాగైనా దభాలున ఆ శుభలేఖను తన చేతుల్లో తీసుకొని వాసుకు చూపించకండా వుండాలని తాపత్రయం. అది సాధ్యంకాదని మళ్ళీ తనకే అనుమానం.

రెండు కళ్ళూ ఆ కవరుమీద వున్న తన పేరును ఆకట్టేసినాయి. దస్తూరి అవుతే తేల్చుకోలేక పోతున్నాడు. ఇది అలాంటి బాపతుదే అని నిశ్చయం చేసుకున్నాడు. ఆనాడు తాను అమాంతం కవరు విప్పి చూడగానే శుభలేఖతోపాటు ఒక చిన్న చీటీ కూడా వచ్చేసింది.

'శ్రీ రాంబాబుగార్కి, తమరు చూసి నచ్చలేదన్న మా అమ్మాయి వివాహానికి మిమ్మల్ని ఆహ్వానించటంలో ప్రత్యేకత వుందని మేము భావి స్తున్నాము. మీరు ఆనాడు మమ్మల్ని తృణీకరించటం మాపట్ల వర ప్రసాదం అయింది. నూతన వరున్ని చూసి మీరు అసూయపడరని ఆశి స్తున్నాము. మీరు యీ వివాహానికి తప్పక రావాలని మా కోరిక. నూతన వధూవరులు మీకు త్వరగా పెళ్ళి కావాలని నిండు మనస్సులతో ఆశీర్వ దిస్తారు... ఇట్లు...'

రాంబాబు ఆనాడు తాను చూసిన చీటీని మనస్సులోనే చదువు తున్నాడు. మొహంమీద చెమట బిందువులు అప్పటి కప్పుడే చేరిపోతు న్నాయి. కాళ్ళూ చేతులూ చచ్చుబడ్డట్టుగా నీరసపడిపోతున్నాయి. చప్పున తల విదిలించేసి జేబురుమాలతో మొహమంతా తుడుచుకుని "ఒరేయ్ వాసూ! ఆ కవరేమిటో చూడ్రా నా మనస్సేమీ బాగాలేదు..." అన్నాడు రాంబాబు.

'నువ్వసలే సెంటిమెంటల్ ఫెలోవి. నేనేందుకు చెబుతున్నానో గ్రహించుకోవు. నీకు పెద్ద వానిటీ వుంది. అది యింకోళ్ళలో చూసి సహించలేవు. డాక్టర్ రాధాకృష్ణన్ యేమన్నాడో తెలుసా. సహనమే సభ్యతా లక్షణం అన్నాడు. నీకు అదిలేదు. దాంతోపాటు అవగాహన సరిగా అర్థం చేసుకోవటం అంతకంటే లేదు. నువ్వేదో చాలా బాధపడు తున్నట్టుగా కనివిస్తున్నావు. ఆ కవరేమిటో చూడాలనే తాపత్రయము నాకేమీలేదు. నువ్వు తీసి లోపల పెట్టేసెయ్యి. తాపీగా నే వెళ్ళిన తర్వాత విప్పి చదువుకో. ఒక మనిషిని అవమానం చెయ్యటం, లేని బలహీనతలను యెత్తిపొడవటం గాని నే నెన్నటికీ చెయ్యను. నేను యెన్నిసార్లు చెప్పినా నీ మనస్సులో మార్పు వస్తుందనే అనుకున్నా,కాని ఆడవాళ్ళమీద ద్వేషం అసహనం పెంచుకుంటావని మాత్రం నే ననుకోలేదు...'

'ఇదిగో యిప్పుడు యేదో నువ్వంటున్నావన్నమాటే గాని నాకేమీ వినిపించటంలేదు, నాకేమీ అర్థం కావటం లేదు. నా మాటవిని ఆ కవ రేమిటో విప్పిచూడు...' రాంబాబు గట్టిగానే అన్నాడు.

చాలా తీవ్రవగా చూస్తూ కూర్చున్నాడు, వాసు. కొంచెం తటపటా యించి చేతిలోకి కవరును తీసుకున్నాడు. అనుకున్నట్లుగానే లోపల శుభ లేఖ వుంది. రాంబాబు గంభీరంగా చూస్తున్నాడు.

'సునంద్‌కు సునీల్‌కు వివాహం అంటాడు! ఎవరు వీళ్ళు!...' అన్నాడు మొహం చిట్లిస్తూ వాసు.

సునంద అనంగానే రాంబాబు గుండె దడదడ కొట్టుకుంది. నిబ్బ రంగా వుండిపోయాడు.

సునంద సునంద ... అని నాలుగైదుసార్లు లోపల లోపల అను కున్నాడు. 'సునంద చాలా మంచిది. చురుకైనది. సంగీతం పాడుతుంది.

ఈ మధ్యనే భరతనాట్యంకూడా నేర్చుకుంది. బి. ఏ. కంప్లీట్ చేసింది. ఇంకా యేవేమిటో చెప్పారు. నిజంగా చూస్తే, ఆ అమ్మాయి నే ననుకున్న సునంది కాదు, ఏదో మోసం జరిగింది. అదెవ్వరూ పైకి చెప్పలేదు. చివరికి నేను సునందను వద్దన్నానన్న మాటమాత్రం మిగిలిపోయింది. పోన్లే ఆ అమ్మాయి పెళ్ళి శుభలేఖ నాకు పంపించినంత మాత్రాన నా కొచ్చిన అగౌరవం యేమీ లేదు'. అనుకుంటూ అనుకుంటూనే కవర్లో యింకే మన్నా చీటీవుందా అని అప్రయత్నంగా అనేసి, నాలుక కరుచుకున్నాడు.

'చీటీ... ఏం చీటీ శుభలేఖనే వుంది... ఓహో అదా. డిన్నర్... రిసెప్షన్ కార్డు యేమైనా విడిగా వుందా అంటావా...?'

'ఆc... ఆ!... అదే...' తడబడ్డాడు రాంబాబు.

'ఎవరో దూరపు బంధువుల్లే...' మాట తప్పించటానికి ప్రయత్నం చేశాడు.

'ఏమిటి అట్లావున్నావ్! వంట్లో బాగా లేదా! ... వాసుదగ్గరగా వచ్చి రాంబాబును నుదురుమీద చెయ్యి పెట్టాడు.

'చల్లగానే వుందే ...'

'ఏం లేదు ... నీతో ఓమాట చెపుదామని ...' చప్పున ఆ శుభ లేఖను మడిచి పాంట్ జేబులో పెట్టేశాడు.

'ఈ అంతర్జాతీయ మహిళా సంవత్సరంలోనైనా ఆడవాళ్ళ పట్ల నా దృక్పథాన్ని మార్చుకుందామని తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నా. ఇహ నేను పెళ్ళి చూపులకని యెక్కడికి వెళ్ళను...'

'నీ మాటకు అడ్డం వస్తున్నాననుకోకపోతే నేనొకటి చెపుతా ... ఈ సంవత్సరంలోనే యేదో ప్రాముఖ్యత ఆడవాళ్ళకు వచ్చిపడిందనుకోక.

ఆడవాళ్ళకు గౌరవించటం వాళ్ళకూ తగిన మర్యాదివ్వటం యెప్పుడూ నేర్చుకోవాల్సిందే. వాళ్ళను కేవలం ఆటబొమ్మలుగా చూసే యీ మగ వాళ్ళ మనస్తత్వం పూర్తిగా మారిపోవాలి.........' ఇంకా ఉద్రేకంగా యేదో చెప్పబోతుంటే, రాంబాబు ఆపేసి 'ఊరికే నన్ను ఉపన్యాసాలతో ఊదర పెట్టకు. నువ్వు చెప్పిందేమిటో నేనర్థం చేసుకొన్నాను. ఇహ చాలు ... చెప్పమంటవా ...'

వాసు చెప్పమన్నట్టు తలవూపాడు.

'ఈ మధ్యనే అంటే షుమారు నెల రోజులనుకో. నేను రోజూ సాయంత్రం టాంక్‌బండ్ మీదికి వెళుతూ వుంటాను. అక్కడ బస్సు స్టాండ్ దగ్గర ఓ అమ్మాయి చాలా వయ్యారంగా నడుస్తూ వచ్చి నిలబడు తుంది. కొంటెగా చూస్తుంది. కిలకిల నవ్వుతుంది. ఆ చూపులు ఆ నవ్వులు నా మనస్సును ఆకట్టేసినాయి. ఇట్లా రోజూ మేం యించుమించు కలుసు కుంటూనేవున్నాం. నా విషయమంతా ఆ అమ్మాయికి చెప్పేసాను. ఆ అమ్మాయి సంగతంతా నాకు చెప్పేసింది.'

'నీ విషయమయితే నాకు తెలుసుగదా. ఆ అమ్మాయి విషయ మేమిటో చెప్పు...

'చెప్పటాని కే ముంది. ఆ అమ్మాయి : అన్నట్టు ఆమె పేరు సుగుణ. అప్పగారింట్లో వుంటోందిట. ఉద్యోగం చేస్తోంది. చెల్లెలికి పెళ్ళి సంబంధం కుదురుద్దామని అప్పగారు తీసుకొచ్చారట. సంబంధం కుదిర్లేదు కాని ఓ ఉద్యోగం కుదిరిందిట. ఉద్యోగం వస్తే యెవరు చెయ్యకుండావుం టారు. ఇహ ఆమెపెళ్ళి చేసుకోవటానికి ప్రయత్నాలు చేస్తోందిట. ఇంత లోకే...'

"అక్కడికి ఆపేసెయ్యి... ఇంతకీ నీకు నచ్చిందన్నావు బాగానే

వుంది. మరి ఆ అమ్మాయికి నీ విషయమో...' వాసు ప్రశ్నార్థకంలాగ నిలబడ్డాడు.

"ఓసారి మా యింటికి కూడా వచ్చింది. ఆనాడే మనవాళ్ళంతా బజారు వెళ్ళారు. ఇంట్లో యెవ్వరూ లేకపోయే టప్పటికి తిరిగి వెళ్ళిపోయింది...."

"మంచిపని చేసింది...."

"అంతే?..."

"ఏముంది. తిరిగి వెళ్ళిపోయింది, మీ అమ్మావాళ్ళుంటే కాసేపు కూర్చున్నా మాట్లాడినా అందం చందమూ నూ—"

"నువ్వేది మాట్టాడినా నాకేదో వికటంగా అర్థం కనిపిస్తుంది. అది నీ మాటల్లోవుండో నేను వూహించుకోవటంలో వుందో."

"ఇంతకీ అసలు విషయం చెప్పు"

"నామూడ్ అంతా చెడగొట్టేశారు. వద్దువద్దంటే పట్టుపట్టి ఆపిల్లని చూడమని నన్ను వేధించుకు తిన్నారు. అందులో నువ్వుకూడా వెళ్ళమన్నావని నన్ను వత్తిడి చేశారు. లేక పోతే నేను వెళ్లే వాణ్నికాదు.

"అయిపోయిందిగాదా. మళ్ళీ ఆ విషయాన్నే గుర్తుచేస్తావెందుకు చెప్పు. నువ్వు ఇంటర్వ్యూలో ఫెయిల్ అయిపోయినావు కూడా."

"నాకు కోపం తెప్పిద్దావని నువ్వంటున్నావే గాని నిజంగా నీకు మాత్రం యిష్టమా! ఆనాడు జరిగిన తతంగం నువ్వు కళ్ళారాచూస్తే స్త్రీ జాతిమీధ నీకున్న గౌరవమర్యాదలు యిట్టే యెగిరి పోయేవి."

"ఏదో ఒక ఇన్సిడెంట్‌తో నాఆదర్శాలన్నీ పోగొట్టుకుని కూకటి వేళ్ళతో కూలిపోను. ఇప్పుడు అదంతా యెందుకు గాని—ఇంతకీ సుగుణ సంగతి ఏమిటో చెప్పు."

"ఆ అమ్మాయికూడా నాకున్న అభిప్రాయాలే వున్నట్టు నాకు అనేక రకాల దాఖలాలు కనిపించినాయి. ఆ అమ్మాయి మాదిరి అందరు ఆడవాళ్లూ కనకవుంటే నాకు మహిళాలోకంమీద వున్న దురభిప్రాయం యెప్పుడో పోయివుండేది." ...

"ఇంతకీ ఆడవాళ్ళమీద నీకు దురభి ప్రాయాలు కలగటానికి కారణాలేమిటో తెలుసుకోవచ్చా !" వాసు మెల్లిగా అడిగాడు.

"అది తర్వాత చెపుతాలే ... సుగుణ నన్ను తినింటికి పిలుస్తా నన్నది. ఆ శుభ ఘడియ యెప్పుడొస్తుందా అని యెదురు చూస్తున్నాను. ఆనాడు నువ్వుకూడా నాతో రావాలి. వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడి నిశ్చయం చేసుకోవాలి."

వాసు పెద్దగా నవ్వాడు గభాలున. రాంబాబు ఉక్కిరి బిక్కిరయి 'నీకన్నీ ఎగతాళిగానే వుంటాయి. ఏది చెప్పినా నువ్వు నమ్మవ్వు" అంటూ విసుక్కున్నాడు.

"ఆ అమ్మాయి నిన్ను మనసారా ప్రేమించిందని యేదో ఊహా గానంగా చెపుతున్నావేగాని, దానికి తగిన కారణాలు సందర్భాలు యేం కనిపించటం లేదే. నవ్వనుకున్నవి యెంతవరకు సబబో నాకేమీ అర్థం కావటంలేదు. ఇక్కడ కూడా నువ్వు ఒకే మాదిరిగా అనుకుంటున్నావు. ఎంత సేపటికి నీకునచ్చింది నువ్వు మెచ్చావు యివేమాటలు ఆ అమ్మాయి మనస్సు కనుక్కున్నావా ? ఏం కావాలని కోరుకుంటోంది. నువ్వేమి కోరి కలు తీర్చగలవు, నీ అర్హతలేమిటీ?'

'అబ్బా ...' గట్టిగా అరిచి చెవులు మూసుకున్నాడు రాంబాబు, 'ఇంక ఆపు, నేను వినలేను' అంటూ.

వాకిటి తలుపు చప్పుడవంగానే యిద్దరూ ఒకేసారి వెళ్ళి తలుపు

మీద చెయ్యి పెట్టారు. తలుపులు తెరవంగానే సుగుణ యెదురుగా నిలబడి వుంది.

ఆమె కిలకిల నవ్వింది. రాంబాబు మొహం యింత అయింది.

'ఈ అమ్మాయే సుగుణ' ...... ఉద్వేగాన్ని ఆవేశాన్ని అణచుకుంటూ మెల్లిగా అన్నాడు వాసుతో.

"లోపలికి రండి ..." తడబడ్డాడు.

ఆమె ముందుకు వస్తుంటే వీళ్ళిద్దరూ వెనక్కి వెనక్కి అడుగులు వేశారు.

మొహంమీద పడుతున్న ముంగురులను నాజూకుగా ఎడంచేత్తో పైకినెట్టేసి, కుడిచేత్తో పమిటను సర్దుకుంటూ జారిపడిపోబోతున్న హాండ్ బాగ్‌ను గట్టిగా పట్టుకుంది.

రాంబాబు కళ్ళు పెద్దవయినాయి. వాసు కళ్ళు చిన్నవయినాయి. రాంబాబు మొహం వెడల్పయింది వాసు మొహం కురచయి పోయింది.

"మిమ్మల్ని మా యింటికి పిలుద్దామని యెన్నాళ్ళబట్టో అనుకుంటూనే ఉన్నాను. ఈ నాటికి ఆ సమయం వచ్చింది." ... చాలా నింపాదిగా తియ్యగా అన్నది సుగుణ.

"నే చెప్పలా ! —" ఆవేశపడ్డాడు రాంబాబు.

చప్పున తలెత్తి చూసింది. ఈ మాటలు అంటూనే హాండ్‌బాగ్‌లో చెయ్యిపెట్టి ఓ కవరు తీసి రాంబాబుకు అందించింది. రాంబాబు ఆదుర్దాగా కవరు లోపల వేళ్ళు పెట్టబోతుండగానే,

"పై సండే నా మారేజ్. మీరు తప్పక రావాలి ..." అంటూ సిగ్గుతో మెలికలు తిరిగిపోయింది సుగుణ.

"ఒరేయ్ రాంబాబు ... రాంబాబు ... ఏమిట్రా..." కళ్లు తిరిగి క్రింద పడబోతున్నవాన్ని వాసు పట్టుకున్నాడు.

సుగుణ బిత్తరపోతూ ఆశ్చర్యంగా నిలబడిపోయింది.

****